క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని వీరపునాయుని పల్లె మండలం కొమ్మద్ది గ్రామ పరిధిలోని సర్వ రాయసాగర్ రిజర్వాయర్‌లో ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు చేపలు పట్టుకొనుటకు 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు కొమ్మద్ది సచివాలయంలో బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల ప్రతి ఒక్కరు తమ ఆధార్‌కార్డుతో పాటు రూ. 10 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. రిజర్వాయర్ గుత్త పైకం మొత్తం రూ. 2,66,466 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

వ్యాసరచన పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ సంపత్‌కుమార్, కరస్పాండెంట్ ఫాదర్ దేవదాస్ తెలిపారు. బుధవారం కెనరా బ్యాంకు మరియాపురం శాఖ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులకు స్వచ్ఛభారత్ అంశంపై ఈ పోటీలు చేపట్టారు. ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేశారు. బ్యాంకు మేనేజర్ సింహం రత్నపాల్, ప్రధానోపాధ్యాయురాలు రీమా రోజ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప కార్పొరేషన్: డా. బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయ్ జయంతిని జై భీమ్ మాల మహాసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలోని వారికి బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, చైతల్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన ఉపాధ్యక్షులు బండి రమణ, శ్యాంసన్, శేఖర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా చర్యలు పాటించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వాహన దారులు రహదారి భద్రతా నిబంధనలు విధిగా పాటించాలని ఆర్టీసీ కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కడప నగరంలోని నాగార్జున హైస్కూలులో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిబంధనలను పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని, వాహనదారుల రక్షణ కోసమే ప్రభుత్వం ఈ నిబంధనలు అమలు చేస్తోందన్నారు. వాహన చోదకుల ఆలోచన తీరులో మార్పు రావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా తమకు తామే రక్షించుకోగలరని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ గోపాల్‌రెడ్డి, కడప డీఎం డిల్లీశ్వర రావు, సీఐ కన్యాకుమారి, మంజుల, స్కూలు ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

– ఏపీ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి జి. భానుమూర్తిరాజు



క్యాంపులో శిక్షణ పొందుతున్న స్కౌట్స్‌తో జి. భానుమూర్తిరాజు

కడప స్పోర్ట్స్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించడమే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశ్యమని ఆంధ్రప్రదేశ్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి జి. భానుమూర్తిరాజు పేర్కొన్నారు. కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపును ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, శారీరక ధృడత్వం పెంపొందించేలా కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. క్యాంపులో విద్యార్థులు చక్కగా శిక్షణ పొందాలని సూచించారు. క్యాంపు లీడర్ డాక్టర్ కనల్ కన్నన్ మాట్లాడుతూ క్యాంపులో ఇస్తున్న శిక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో గైడ్ కెపెట్న్ ప్రమీల, స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకర్, స్కౌట్ మాస్టర్స్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం

కడప కల్చరల్ : కడప రాయుడు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి జరగనున్న విషయం తెలిసిందే. ఇందు కోసం టీటీడీ అధికారులు వారం రోజులుగా చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవునికడప పూర్తిగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లతో ఉత్సవ కళను సంతరించుకున్నది. ఆలయంలో టీటీడీ అధికారుల ప్రత్యేక్ష పర్యవేక్షణలో ఇప్పటికే రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రాజగోపురానికి కూడా రంగులు అద్దారు. మిగతా ప్రాంతమంతా శుభ్రపరిచి కొత్తగా కనిపించేందుకు రంగులు వేస్తున్నారు. ఆలయ మాడవీధులతోపాటు చెరువుకట్ట వద్ద నుంచి పది దశావతారాలు, మరో 12 దేవతామూర్తుల విద్యుద్దీప కటౌట్లను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపుల కూడా విద్యుత్ దీపాల సీరియల్ సెట్లను ఏర్పాటు చేశారు. ఆలయం వెలుపల రోజా అలంకారం చేసేందుకు ప్రత్యేకంగా మండపాన్ని తీర్చిదిద్దారు. రథానికి చిన్నపాటి మరమ్మత్తులు చేసి రంగులు వేసి కనుల పండువగా రూపొందించారు. ఆలయంలో కొత్తగా పూలకుండీలు ఏర్పాటు చేసి మొక్కలను ఏర్పాటు చేశారు. ఆలయ రంగ మండపంలో స్తంభాలు రంగురంగులో కనిపించేలా ప్రత్యేకమైన లైటింగ్ సౌకర్యం కల్పించారు.



ఆలయం ఆవరణలో తీర్చిదిద్దిన రంగవల్లి



ఆలయంలో రంగులు వేస్తున్న కార్మికుడు

బుడ్డ శనగ, కొర్ర పంటల పరిశీలన

వీరపునాయునిపల్లె : మండలంలోని అలిదెన సచివాలయ పరిధిలో సాగులో ఉన్న బుడ్డ శనగ, కొర్ర పంటలను బుధవారం కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. బుడ్డ శనగ పంటను తుప్పు తెగులు ఆశించినట్లు గుర్తించామన్నారు. దీని గుర్తించేందుకు ఆకులపై గోదుమ రంగులో గుండ్రని చిన్న తుప్పు మచ్చలు ఏర్పడతాయని తుప్పు తెగులు ఆశించడం వలన పంట నాణ్యత, దిగుబడి తగ్గుతుందన్నారు. దీన్ని గుర్తించిన రైతులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మిల్లీ లీటరు లేదా హెక్సా కొనజోల్ 2మిల్లీ లీటరుకు లీటరు నీటిని కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. అలాగే కొర్ర పంటలో కాండం తొలుచు పురుగు అధికంగా ఉన్నట్లు గుర్తించామని దీని నివారణకు ఫ్లూబెండమైండ్ 0.25మిల్లీ లీటరు లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు బాషా, రైతులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

కమలాపురం : జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు అందిస్తున్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కడప ఆర్‌డీఓ మధుసూదన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఇప్పటికి ఎన్ని పూర్తి అయ్యాయి? ఎన్ని చేయాల్సిన ఉన్నాయని సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలో 783 ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, ఇప్పటికి 265 పూర్తి అయ్యాయని, ఇంకా 518 పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని సిబ్బంది ఆర్‌డీఓ దృష్టికి తీసుకువచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రతి లబ్ధిదారునికి అందించే పట్టాను తప్ప రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని, వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆర్‌డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అమలుతో విశ్వసనీయత

– వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పీబీ శశికళ



'సిద్ధం' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళా నేతలు

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల విశ్వసనీయత చూరగొన్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పీబీ శశికళ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో జోనల్ కో ఆర్డినేటర్ ఎంకే రత్న కుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలు జి. క్రిష్ణవేణిల ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించనున్న ×సిద్ధం× సభ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశికళ మీడియాతో మాట్లాడుతూ మహిళలు పురోగతి సాధిస్తేనే దేశం పురోగతి సాధిస్తుందని డా. బీఆర్ అంబేడ్కర్ చెప్పారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆయన ఆశయసాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఓటమి భయంతో చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు మహిళలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. మే తర్వాత రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు గల్లంతు కావడం ఖాయమన్నారు. గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన 600 హామీలలో ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలోనే రాష్ట్రంలో మహిళా సంక్షేమం, సాధికారత సాధ్యమైందన్నారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులు, చివరికి మంత్రివర్గంలో కూడా మహిళలకు పెద్దపీట వేశారన్నారు. మహిళలను లక్షాధికారులను చేస్తామని చెప్పి చేసి చూపించారన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది మహిళలకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మిస్తున్నారని, వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతలలో 75లక్షల మంది మహిళల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ సభ్యులు పత్తి రాజేశ్వరి, బి. మరియలు, నగర మహిళా అధ్యక్షురాలు టి పి వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, మల్లేశ్వరి తులశమ్మ, ఆర్ పి యూనియన్ నగర మహిళా అధ్యక్షురాలు విజయ, నారాయణమ్మ, జహీరాబాను తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వల్లూరు : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. వల్లూరు, తప్పెట్ల, లేబాక, పెద్దపుత్త, దుగ్గాయపల్లె, పైడికాలువ, దిగువపల్లె, గోటూరు, అంబవరం, తొల్లగంగనపల్లె తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం దిగువపల్లెలోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రశాంత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మందులను పంపిణీ చేయండి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఈనెల 9వ తేదీ నుంచి నులిపురుగుల నివారణ మందు ఆల్బెండజోల్–400ఎంజీను పంపిణీ చేయాలని నగర కమిషనర్ రాముడు, అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నందకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం తదితర లక్షణాలున్న వారిలో నులిపురుగులు ఉంటాయన్నారు. 1–19 ఏళ్ల బాల బాలికలు, యువతీ, యువకుల్లో నులిపురుగులను నివారించడానికి శుక్రవారం నుంచి అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఈ మందులను పంపిణీ చేయాలన్నారు. అలాగే ఇప్పటికే అన్ని పాఠశాలలకు ఈ మందులు సరఫరా చేశామన్నారు. పాఠశాల సిబ్బంది కూడా తమ పరిధిలోని పిల్లలకు ఈ మందులను పంపిణీ చేయాలన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాడని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని పాతసంగటిపల్లె గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, సర్పంచ్ సుజాత, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, చెన్నారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మల్బరి సాగుతో రైతులకు ప్రయోజనం



మాట్లాడుతున్న కేంద్రీయ పట్టు మండలి పరిశోధన సంస్థ సైంటిస్టు కిరణ్‌కుమార్

కడప అగ్రికల్చర్: మల్బరి సాగుతో రైతన్నలకు అధిక ఆదాయం సమకూరుతుందని కేంద్రీయ పట్టు మండలి పరిశోధన సంస్థ సీనియర్ సైంటిస్టు డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కడపలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారి అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన కడప, బద్వేల్ డివిజన్‌కు సంబంధించిన పట్టు రైతులకు మల్బరి సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ బాలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడారు. కొత్తగా మల్బరి సాగు చేసే రైతులకు ఏ విధంగా సాగు చేయాలి, పట్టు పురుగు పెంపకం ఏ విధంగా చేపట్టాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మల్బరి సాగుతో ఇతర పంటలకంటే అధిక ఆదాయం వస్తుందన్నారు. రెండవ ఏడాది నుంచి ప్రతి నెలా ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మల్బరి సాగు రైతులకు మొక్కలకు, షెడ్డు నిర్మాణానికి, ఇతర పరికరాలకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఇందులో ఓసీ, బీసీ రైతులకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక విస్తీర్ణంలో సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌ఎస్ దీక్షిత్, ఏపీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జాతీయ, గ్రామీణ రహదారుల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో వాటిని గుర్తించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామని ఆయా ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు, సూచికలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు లక్ష్మీ ప్రసన్న, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.



జిల్లాలోని రహదారుల వివరాలను డీటీసీకి అందజేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారి

రహదారి భద్రత నియమాలు పాటించాలి

కడప ఎడ్యుకేషన్: వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలని మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, నాగార్జున డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కడప నాగార్జున డిగ్రీ కళాశాలలో రాయల్ రసీద్ ముద్రించిన ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, కోశాధికారి వీరారెడ్డి, కమిటీ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, సత్యనారాయణ, ఆర్‌ఆర్ సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

కడప అగ్రికల్చర్: రైతులు వ్యవసాయంతోపాటు పెరటికోళ్ల పెంపకం చేపడితే అదనపు ఆదాయం సమకూరుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో పెరటి కోళ్ల పెంపకంపై వల్లూరు, సికెదిన్నె, పెండ్లిమర్రి, ఖాజీపేట మండలాలకు చెందిన రైతులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకంతో ఆరోగ్యకరమైన మాంసంతోపాటు గుడ్లు పొందవచ్చన్నారు. తద్వారా శరీరానికి అవసరమైన మాంసకృతులు పొందవచ్చని తెలిపారు. పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌రెడ్డి పెరటికోళ్ల యాజమాన్య పద్ధతులు, టీకాలు వేయించవలసిన పట్టిక, రోగా లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణంగా వివరించారు. అనంతరం అస్సీల్ జాతి కోళ్లను షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద పెంచుకోవడానికి రైతులకు అందచేశారు. కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ పాల్గొన్నారు.



పెరటికోళ్ల పంపిణీ కార్యక్రమంలో రైతులు, కేవీకే బృందం

డీఈఓకు ఘన సన్మానం



డీఈఓ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప డీఈఓగా పనిచేస్తున్న ఎద్దుల రాఘవరెడ్డికి ఆర్‌జేడీగా పదోన్నతి కల్పించడంతో బుధవారం కడప డీఈఓ కార్యాలయంలో పిఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మెన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీగా పదోన్నతి పొందిన రాఘవరెడ్డి మాట్లాడుతూ మన పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతానికి కృషి చేయడంతోపాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా నాయకులు రామకృష్ణంరాజు, వేణుగోపాల్‌రావు, మురళీధర్, పాలెం రాజా, వెంకట్రామరాజు, కులశేకర్‌రెడ్డి, చలపతిరాజా తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలను అనుసరిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి

వైవీయూ : సాంప్రదాయ విధానాలను విడనాడి ఆధునిక పద్ధతులను పరిశోధనల్లో వినియోగించి జంతు జీవకోటిని కాపాడుకుందామని యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. 'మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు – నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు' అన్న అంశంపై రెండు రోజుల సెమినార్ ముగింపు సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రయోగశాలలలో జంతువుల స్థానంలో ప్రత్యామ్నాయ విధానాలను అవలంబించడం పట్ల అర్ధవంతమైన చర్చ జరిగిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ప్రయోగశాలలలో వినియోగించే దిశగా మనం వెళ్లాలన్నారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల సెమినార్ భావిపరిశోధకులకు విలువైన సమాచారం అందించిందన్నారు. తిరుపతి ఎస్వీయూ ఫిజియాలజీ విశ్రాంత ప్రొఫెసర్ వి.హెచ్.రావు ఉపన్యసిస్తూ జంతువులను బాధలనుంచి తప్పించే కొత్త మార్గాలను అన్వేషించే బాధ్యత పరిశోధకులపై ఉందన్నారు. శాంతిభట్నాగర్ అవార్డు గ్రహీత, హైదరాబాద్ సీడీఎఫ్‌డీ గ్రూప్ లీడర్ డా. మద్దిక సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ లో ఫింగర్ ప్రింట్స్ ఎలా వినియోగిస్తారు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఊటీ జేఎస్ఎస్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ టి.కె. ప్రవీణ్ మాట్లాడుతూ జంతువుల పరిశోధన చరిత్ర, ప్రత్యామ్నాయ పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. సదస్సులో సెమినార్ నిర్వహణ సంఘం సభ్యులు డా. ఎస్.పి. వెంకట రమణ, డా. వి. అను ప్రసన్న, డా. ఎ.టి. వెంకట్రమణారెడ్డి, డా. ఎ.ఎస్.పి. మరియదాస్, బి. మనస్వి పాల్గొన్నారు.

కర సేవకులకు ఘన సన్మానం



సన్మానించిన కరసేవకులతో అయోధ్య ఐక్య వేదిక సభ్యులు

కడప కార్పొరేషన్: అయోధ్యలో ఇటీవల జరిగిన బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై తిరిగి వచ్చిన కరసేవకులను అయోధ్య ఐక్య వేదిక రథసారథి పి. జయచంద్రారెడ్డి, ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, రాణాప్రతాప్, బాబీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం ఏపీహెచ్‌బీ కాలనీలోని కోదండ రామాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 32 మంది కర సేవకులను శాలువాలు కప్పి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ దక్షిణ ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, కాకర్ల రాముడు, నాగేంద్ర, భక్తులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం అందివ్వాలి



మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: బాల నేరస్తులకు న్యాయ సహాయం అందివ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సూచించారు. బుధవారం పాన్ ఇండియా ప్రచారం– 2024 మొదలగు అంశాలపై ఆయన ప్రచారం చేశారు. కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ జైళ్లను సందర్శించారు. ఈ పాన్ ఇండియా ప్రచారం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సబ్‌జైళ్ల సూపరింటెండెంట్‌లు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

– కమలాపురం, జమ్మలమడుగు కోర్టులను సందర్శించిన ఆయన ఈనెల 9న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. కమలాపురం మండల న్యాయసేవాసమితి చైర్మన్ కం జూనియర్ సివిల్ జడ్జి ఎస్. లావణ్య, జమ్మలమడుగు న్యాయసేవా సమితి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిన్న లక్ష్మయ్య, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ ప్రెసిడెంట్‌లు, పోలీసు అధికారులు, బ్యాంక్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.